ఆలయ నిర్మాణానికి విరాళం



చెక్కు అందజేస్తున్న ప్రశాంత్‌ గౌడ్‌

కుత్బుల్లాపూర్‌ : కొంపల్లి మున్సిపాలిటీ ఊర చెరువు సమీపంలో నిర్మిస్తున్న శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ నిర్మాణానికి కాంగ్రెస్‌ మున్సిపల్‌ అధ్యక్షుడు బైరి ప్రశాంత్‌ గౌడ్‌ రూ. 51 వేల చెక్కును బుధవారం విశ్వకర్మ సంఘం కమిటీ సభ్యులకు అందజేశారు. దేవాలయాల అభివృద్ధికి తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. దాతలు ముందుకు రావాలన్నారు.

విద్యార్థులకు అల్పాహారం



అల్పాహారం అందజేస్తున్న యాదగిరి, హెల్పింగ్‌ హార్ట్స్‌ సొసైటీ సభ్యులు

జగద్గిరిగుట్ట: హెల్పింగ్‌ హార్ట్స్‌ సొసైటీ ఆధ్వర్యంలో మగ్దుం నగర్‌ సీసాల బస్తీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం అల్పాహారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి యాదగిరి హాజరై మాట్లాడారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెల్పింగ్‌ హార్ట్స్‌ సొసైటీ అధ్యక్షుడు తూటే విజయకుమార్‌, వీరేందర్‌ సింగ్‌ రాథోడ్‌, సాజిద్‌, సాయికుమార్‌, హెచ్‌ఎం ఇన్నారెడ్డి పాల్గొన్నారు.

నేడు ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం



కుత్బుల్లాపూర్‌: జీడిమెట్ల డివిజన్‌ హెచ్‌ఏఎల్‌ రాఘవేంద్ర కాలనీలోని ముత్యాలమ్మ ఆలయ నాలుగవ వార్షికోత్సవం సందర్భంగా గురువారం వివిధ పూజలు నిర్వహించనున్నారు. ఉదయం 6:30 గంటలకు అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, 10:30 గంటలకు ఆలయ ప్రాంగణంలో శివ పార్వతుల కల్యాణం, అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నవితరణ, సాయంత్రం 6 గంటలకు అమ్మవారి ఉత్సవ విగ్రహ ఊరేగింపు తదితర కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆలయ చైర్మన్‌ కుంట సిద్దిరాములు ఓ ప్రకటనలో తెలిపారు.

రోడ్డుకు అడ్డుగా ఉన్న స్తంభాల తొలగింపు



రోడ్డుపై ఉన్న స్తంభాలను తొలగిస్తున్న విద్యుత్‌ సిబ్బంది

సుభాష్‌నగర్‌: గాజులరామారం చౌరస్తా వెడల్పు పనులను ఆయా శాఖ అధికారులు పనులు వేగవంతం చేశారు. షాపూర్‌నగర్‌, కూకట్‌పల్లి హౌసింగ్‌ బోర్డు, బాచుపల్లి, మియాపూర్‌లను కలిపే ఈ చౌరస్తా గుండా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో రద్దీగా ఉంటుంది. వాహనాలు సంఖ్య పెరగడంతో రాకపోకలకు ఆటంకంగా మారింది. గతంలో జీడిమెట్ల ట్రాఫిక్‌ పోలీసుల నేతృత్వంలో ఆయా శాఖల అధికారులతో చౌరస్తా విస్తరణకు పనులు ప్రారంభించారు. జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో చౌరస్తాకు ఇరువైపులా 50 మీటర్ల దూరంలో రోడ్డు వెడల్పు పనులు ప్రారంభించారు. రోడ్డుకు అడ్డుగా ఉన్న 20 స్తంభాలను అధికారులు తొలగిస్తున్నారు.

ప్రభుత్వ స్థలంలో డబ్బాల తొలగింపు



సుభాష్‌నగర్‌: రెవెన్యూ శాఖ, ప్రైవేట్‌ వ్యక్తుల మధ్య నడుస్తున్న స్థలంలో కొంతమంది రాత్రికి రాత్రే నిర్మాణాలు, డబ్బాలు ఏర్పాటు చేశారు. దీంతో రెవెన్యూ అధికారులు పోలీసు భద్రత మధ్య తొలగించారు. సాయిబాబానగర్‌ చౌరస్తాలో సర్వే నంబర్‌ 49/7 స్థల వివాదం రెవెన్యూ, గణేష్‌ నగర్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ మధ్య కొన్ని సంవత్సరాలుగా కోర్టులో నడుస్తుంది. ఇదే అదునుగా కొంతమంది సదరు స్థలంపై కన్నేశారు. మంగళవారం రాత్రి డబ్బాలు, నిర్మాణాలు చేపట్టడంతో విషయం తెలుసుకున్న ఇన్‌స్పెక్టర్‌ గులాం కలీం బుధవారం సిబ్బందితో నిర్మాణాలను తొలగించారు. కేసులు నమోదు చేస్తారనే భయంతో కూల్చి వేస్తున్న సమయంలో ఎవరు అటువైపు రాలేదు. సదరు స్థలంలో ఎవరైనా నిర్మాణాలు చేపట్టినట్లు రుజువైతే కేసు నమోదు చేస్తామని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో ఆలయాల్లో పూజలు

మౌని అమావాస్య సందర్భంగా అన్నదానాలు

జగద్గిరిగుట్ట: మౌని అమావాస్యను పురస్కరించుకొని బుధవారం వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. జగద్గిరిగుట్ట కొండపై ఉన్న కాళికాదేవి, జగద్గిరిగుట్ట లాస్ట్‌ బస్టాప్‌ దుర్గమ్మ, జీడిమెట్లలోని సరోజినీ గార్డెన్‌ సమీపంలోని ముత్యాలమ్మ ఆలయాలలో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. దుర్గమ్మ ఆలయం వద్ద శ్రీ వాసవి సేవా సమితి, కాళికామాత ఆలయంలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో, జీడిమెట్ల ముత్యాలమ్మ గుడి ఆలయంలో సుచిత్ర వాసవి సేవాదల్‌ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు కొనసాగాయి. అలాగే మగ్దూం నగర్‌, మైసమ్మనగర్‌లలో బొడ్రాయిల వద్ద స్థానికులు పూజలు నిర్వహించారు.



జగద్గిరిగుట్ట కొండపై ప్రత్యేక అలంకరణలో కాళికాదేవి



ప్రత్యేక అలంకరణలో జగద్గిరిగుట్ట లాస్ట్‌ బస్టాప్‌లోని దుర్గమ్మ అమ్మవారు



మగ్దూం నగర్‌లో బొడ్రాయి వద్ద పూజలో పాల్గొన్న భక్తులు



జీడిమెట్ల ముత్యాలమ్మ గుడి వద్ద సుచిత్ర వాసవి సేవాదల్‌ ఆధ్వర్యంలో అన్నదానం

రోడ్డు వెడల్పు చేయాలని మంత్రికి వినతి

దుండిగల్‌: భౌరంపేటలో రోడ్డు వెడల్పు పనులను వెంటనే చేపట్టాలని ప్రణీత్‌ ప్రణవ్‌ బ్లూమ్స్‌ ఓనర్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు కోల లచ్చిబాబు కోరారు. ఈ మేరకు బుధవారం నగరంలో రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. బాచుపల్లి వీఎన్‌ఆర్‌ కళాశాల నుంచి భౌరంపేటలోని బొడ్రాయి వరకు ఉన్న 30 ఫీట్ల రోడ్డును 100 ఫీట్లకు విస్తరించాలని, ఇదే రహదారిలో ఇంటర్నేషనల్‌ స్కూళ్లు, అపార్ట్‌మెంట్లు, బహుళ అంతస్తులు ఉన్నాయని తెలిపారు. వాహనాల రద్దీతో తరచూ ట్రాఫిక్‌ సమస్యలు ఏర్పడుతున్నాయని, రోడ్డు విస్తరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.



మంత్రి కోమటిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న లచ్చిబాబు

అర్ధంతరంగా నిలిచిన కల్వర్టు పనులు

కల్వర్టును రోడ్డుకు అనుసంధానం చేయని వైనం

రంగారెడ్డినగర్‌: అధికారుల నిర్లక్ష్యం వల్ల లక్షలాది రూపాయల నిధులతో చేపట్టిన పనులు ముందుకు సాగకపోవడంతో వాహనదారులకు ప్రాణ సంకటంగా మారుతోంది. కుత్బుల్లాపూర్‌ సర్కిల్‌ కార్యాలయం నుంచి కుత్బుల్లాపూర్‌ గ్రామం వరకు రెండేళ్ల క్రితం సుమారు రూ.2 కోట్ల నిధులతో రోడ్డు విస్తరణ పనులను చేపట్టి పూర్తి చేశారు. అయితే సర్కిల్‌ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న నాలా వద్ద విస్తరించకపోవడంతో 'సాక్షి' పలు కథనాలు ప్రచురించింది. ఎట్టకేలకు 6 నెలల క్రితం రూ.25 లక్షల నిధులు వెచ్చించి కల్వర్టు నిర్మాణం చేపట్టి పూర్తి చేశారు. అయితే రోడ్డుకు ఇరువైపులా కల్వర్టుకు రక్షణ గోడతో పాటు రోడ్డుకు అనుసంధానం చేయకుండా సదరు కాంట్రాక్టర్‌ చేతులు దులుపుకున్నాడు. కల్వర్టు ప్రాంతంలో ప్రమాదం జరగకుండా అధికారులు తాత్కాలిక రక్షణ కవచాన్ని ఏర్పాటు చేశారు. అయితే రాత్రి వేళల్లో ఇటుగా రాకపోకలు సాగించే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు కల్వర్టు ప్రాంతాన్ని రోడ్డుతో అనుసంధానం చేయిస్తారా? లేక అలాగే వదిలేస్తారా? అన్నది వేచి చూడాలి.



కుత్బుల్లాపూర్‌ సర్కిల్‌ కార్యాలయ సమీపంలో అసంపూర్తిగా వదిలేసిన కల్వర్టు నిర్మాణ ప్రాంతం

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

చింతల్‌: విద్యుత్‌ మరమ్మతుల కారణంగా వివిధ సబ్‌స్టేషన్ల పరిధిలోని ఆయా ఫీడర్లలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు బోయిన్‌పల్లి ఏడీఈ శ్రీకాంత్‌ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు చిన్నతోకట్ట సబ్‌స్టేషన్‌ మహాత్మానగర్‌ ఫీడర్‌ పరిధిలో బాలాజీ ఎన్‌క్లేవ్‌, మల్లికార్జున కాలనీ, ఫ్రెండ్స్‌ కాలనీ, యాదవ బస్తీ,, సాయికృష్ణ కాలనీ, రమ్య హాస్పిటల్‌ అపోజిట్‌, బోయిన్‌పల్లి ఎక్స్‌ రోడ్సు, ఛత్రి గడ్డ, జీపీ సంఘం, మల్లికార్జున కాలనీ, మైనార్టీ స్కూల్‌, భాగ్యశ్రీ గార్డెన్‌, మధ్యాహ్నం 3:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బోయిన్‌పల్లి సబ్‌స్టేషన్‌ సంచారపురి ఫీడర్‌ పరిధిలో సంచారపురి కాలనీ, పబ్లిక్‌ సెక్టర్‌ కాలనీ, ఉమా నగర్‌, రిలయన్స్‌ విల్లాస్‌, ముస్లిం గ్రేవ్‌ యార్డ్‌, తెలంగాణ గార్డెన్‌ తదితర ప్రాంతాల్లో మరమ్మతల కారణంగా విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు.

అల్పాహారం వితరణ

నిజాంపేట్‌ : నిజాంపేట్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధి బాచుపల్లి మమత హాస్పిటల్‌ ప్రాంగణంలో అమావాస్య అల్పాహారం వితరణ కార్యక్రమాన్ని బుధవారం తూములూరి అనిల్‌ కుమార్‌ గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్‌ఎంసీ 16వ డివిజన్‌ మాజీ కార్పొరేటర్‌ పాండు హాజరయ్యారు. 200 మందికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌, ఆంజనేయులు, నారాయణ, ఆంజనేయులు, రామచంద్ర, రాజేశ్వరరావు, మహదేవ్‌, విశ్వనాథం పాల్గొన్నారు.

గుంతల రోడ్లు.. మరమ్మతులు చేయరూ!



దూలపల్లి రోడ్డులో అపురూప కాలనీ క్రాసింగ్‌ వద్ద



జీడిమెట్ల నుంచి రాంరెడ్డినగర్‌ వెళ్లే రోడ్డులో..

జీడిమెట్ల: పారిశ్రామిక ప్రాంతంలో రోడ్లు గుంతల పడిన చోట టీఎస్‌ఐఐసీ అధికారులు మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. జీడిమెట్ల నుంచి దూలపల్లి వెళ్లే రోడ్డులో రెండు మూడు చోట్ల గుంతలు ఎక్కువగా ఉన్నాయి. అదేవిధంగా జీడిమెట్ల నుంచి రాంరెడ్డినగర్‌ వెళ్లే రోడ్డులో సైతం రోడ్డు పాక్షికంగా దెబ్బతిని ఉంది. మరికొన్ని చోట్ల గుంతలు విపరీతంగా ఉన్నాయి. దీంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ఘనంగా ఎస్‌పీఎస్‌ స్కూల్‌ సైన్స్‌ అండ్‌ ఆర్ట్స్‌ కార్నివల్‌

కుత్బుల్లాపూర్‌: కొంపల్లిలోని శివశివానీ ఎస్‌పీఎస్‌ స్కూల్‌లో బుధవారం సైన్స్‌ అండ్‌ ఆర్ట్స్‌ కార్నివల్‌ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రాధాకృష్ణులు రాసకేళి, కేరళ నృత్య ప్రదర్శన, విష్ణుమూర్తి దశావతారాలు, సోది చెప్పే చిన్నారిల ప్రదర్శన హైలెట్‌గా నిలిచాయి. సంస్కృతీ సాంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు విద్యా సంస్థల చైర్మన్‌ ఆరతి సంపతి తెలిపారు. కార్యక్రమంలో వైస్‌ ప్రెసిడెంట్‌ శైలేష్‌ సంపతి, అసోసియేట్‌ డిప్యూటీ ప్రెసిడెంట్‌ దీపిక సంపతి, హెచ్‌ఎం శారద, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సోది చెబుతున్న చిన్నారి



దశావతారాల్లో చిన్నారులు

గురుకుల పాఠశాల తనిఖీ

కీసర: కీసర ఓఆర్‌ఆర్‌ జంక్షన్‌ సమీపంలోని మహాత్మాజ్యోతిబా పూలే బాలికల గురుకుల(బాలనగర్‌, సనత్‌నగర్‌,) పాఠశాలను మంగళవారం రాత్రి తెలంగాణ రాష్ట్ర వైద్య , ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్‌ సెక్రటరీ క్రిస్టినా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా, వసతులు ఎలా ఉన్నాయి, బోధన తదితర అంశాలను తెలుసుకున్నారు. హాస్టల్‌లో వంటగది , భోజనశాల, ఇతర వసతులను పరిశీలించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి చదువుల్లో రాణించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

దుండిగల్‌: రైతులందరికీ ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని భౌరంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం చైర్మన్‌, డీసీసీబీ డైరెక్టర్‌ మిద్దెల బాల్‌రెడ్డి కోరారు. ఈ మేరకు జిల్లా అడిషనల్‌ కలెక్టర్‌ విజేందర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళకు రైతులకు సంబంధించిన వివరాలను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భౌరంపేట పీఏసీఎస్‌ పరిధిలో రుణమాఫీకి 632 మంది అర్హులైన రైతులుండగా 17 మందికి మాత్రమే చేశారన్నారు. మిగిలిన రైతులకు త్వరలోనే రుణమాఫీ చేయాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్‌ జిల్లా అధ్యక్షులు రందీప్‌ రెడ్డి, సురేష్‌ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



అడిషనల్‌ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాల్‌రెడ్డి

వీఎన్‌ఆర్‌ వీజేఐఈటీలో ఆటో హెరిటేజ్‌ ఫెస్ట్‌

నిజాంపేట్‌ : ప్రపంచ వాహన దినోత్సవం సందర్భంగా ప్రగతినగర్‌లోని వీఎన్‌ఆర్‌ విజ్ఞానజ్యోతి ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ ఇంజనీరింగ్‌ అండ్‌ టెక్నాలజీలో బుధవారం ఆటో హెరిటేజ్‌ ఫెస్ట్‌ 2025 పేరిట కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి తేజస్వీ గ్రీన్‌ ఎనర్జీ సంస్థ వ్యవస్థాపక సంచాలకులు జతిల్‌ శర్మ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత అనుభవాలను పంచుకుంటూ జపాన్‌, యూఎస్‌ఏ వంటి దేశాలు సాధిస్తున్న విజయాలు మనకు మార్గదర్శకం కావాలన్నారు. విజ్ఞానజ్యోతి సంస్థ ప్రధాన కార్యదర్శి కోడె దుర్గా ప్రసాద్‌ మాట్లాడుతూ.. ఒకప్పుడూ పెద్దగా అభివృద్ధి చెందని వాహనరంగం నేడు టీవీఎస్‌, మహీంద్ర వంటి పరిశ్రమల ద్వారా ప్రపంచంలో వివిధ దేశాలకు వాహనాలను, విడిభాగాలను ఎగుమతి చేసే స్థాయికి చేరుకుందన్నారు. హ్యుందాయ్‌ వంటి సంస్థలు భారతదేశంలో విద్యుత్‌ వాహనాల తయారీ పరిశ్రమను నెలకొల్పాలని ముందుకు వస్తున్నాయని తెలిపారు. కళాశాలలోని ఆటోమొబైల్‌ ఇంజనీరింగ్‌ విభాగాధిపతి ప్రొఫెసర్‌ డా.షేక్‌ అమ్జాద్‌ మాట్లాడుతూ.. 1000 మంది జనాభాకి సగటున 38 వాహనాలు మాత్రమే ఉన్నందున ఎన్నో అవకాశాలు విద్యార్థులకున్నాయని తెలిపారు. అదేవిధంగా కళాశాల ప్రధానాధ్యాపకులు ప్రొఫెసర్‌ డా.సి.డి.నాయుడు, సంచాలకులు ఆచార్య డా.బి.చెన్నకేశవ రావు మాట్లాడారు.



డ్రైనేజీ సమస్య పరిష్కరించరూ!

కుత్బుల్లాపూర్‌ : షాపూర్‌ నగర్‌ ప్రధాన రోడ్డు ఈఎస్‌ఐ ఆసుపత్రి ఎదుట మూలమలుపు వద్ద డ్రైనేజీ నీరు పొంగిపొర్లింది. సుమారు అర కిలోమీటర్‌ మేరా ఈ డ్రైనేజీ నీరు ప్రవహించడంతో ఆ ప్రాంతమంతా దుర్గంధం వ్యాపించింది. గతంలో ఇదే సమస్య పై స్థానిక ప్రజలు ఫిర్యాదు చేయగా.. తూతూ మంత్రంగా పనులు చేసిన సిబ్బంది.. అదే ప్రాంతంలో తిరిగి డ్రైనేజీ పొంగిపొర్లడం విమర్శలకు తావిస్తుంది. వెల్‌నెస్‌ ఆసుపత్రి నుంచి హరిప్రియ ఆటో ఫైనాన్స్‌ వరకు నర్సాపూర్‌ రాష్ట్ర రహదారి మీదుగా తిరుమల బేకరీ వరకు డ్రైనేజీ పొంగిపొర్లుతుంది. సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



ఫోర్జరీ సంతకాలతో ప్లాట్‌ను విక్రయించిన ఘటనలో మరో వ్యక్తి రిమాండ్‌

దుండిగల్‌: ఫోర్జరీ సంతకాలతో ప్లాటును విక్రయించిన ఘటనలో మరో వ్యక్తిని దుండిగల్‌ పోలీసులు అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన ఆర్‌.రవికుమార్‌ డాక్టర్‌. రవికుమార్‌కు మల్లంపేట ప్రాంతానికి చెందిన రాకేశ్‌, అదే ప్రాంతానికి చెందిన పూర్ణిమను భూ యజమానిగా ఆమె వద్ద నరేశ్‌ బిల్డర్‌గా పని చేస్తున్నట్లు పరిచయం చేశాడు. వీరు ముగ్గురు కలిసి మల్లంపేటలోని కేవీఆర్‌ లే అవుట్‌లో రూ.75 లక్షలకు 167 గజాలను రవికుమార్‌, ఆమె భార్య అరుణ పేర్ల మీద రిజిస్ట్రేషన్‌ చేశారు. అయితే సదరు స్థలాన్ని ఫోర్జరీ సంతకాలతో విక్రయించినట్లు గుర్తించిన రవికుమార్‌ దుండిగల్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మల్లంపేట ప్రాంతానికి చెందిన లావణ్య, కొత్తి ఆంజనేయులు నకిలీ ఆధార్‌ కార్డులు సృష్టించి రిజిస్ట్రేషన్లు చేసినట్లుగా గుర్తించారు. గతంలో లావణ్యను అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించగా.. అప్పటి నుంచి తప్పించుకుని తిరుగుతున్న ఆంజనేయులు(42)ను బుధవారం అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు.

పాఠశాల పునర్‌ నిర్మాణానికి ముందుకొచ్చిన గ్లాండ్‌ ఫార్మా కంపెనీ

సాక్షి ఎఫెక్ట్‌..

రంగారెడ్డినగర్‌: శిథిలావస్థకు చేరుకున్న పాఠశాల పునః నిర్మాణానికి సీఆర్‌పీ నిధులతో గ్లాండ్‌ ఫార్మా కంపెనీ ముందుకు వచ్చింది. రంగారెడ్డినగర్‌ డివిజన్‌ గిరినగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పైకప్పు చిద్రమై పెచ్చులుడటంతో పాటు వర్షాకాలంలో వరదనీరు తరగతులను ముంచెత్తడంతో బురదమయంగా మారుతున్న విషయమై సాక్షిలో «వర్షం వచ్చిందా.. చదువుకు గోవిందా!» అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన గ్లాండ్‌ ఫార్మా కంపెనీ సీఆర్‌పీ నిధులతో నూతన భవనాన్ని నిర్మించేందుకు ముందుకు వచ్చింది. విద్యాశాఖ అధికారులు సైతం పాత భవనాన్ని కూల్చివేసి కొత్త భవన నిర్మాణానికి అనుమతి ఇవ్వడంతో పరిశ్రమ యాజమాన్యం పనులు చేసేందుకు సమాయత్తమైంది. బుధవారం సామాజికవేత్త గంజి ఉదయ్‌, రిటైర్డ్‌ హెడ్‌మాస్టర్‌ అఫ్జల్‌, ప్రిన్సిపాల్‌ విజయ్‌ప్రకాష్‌, సువర్ణ పరిశ్రమ సైట్‌ ఇంజనీర్‌ వంశీ, కాంట్రాక్టర్‌ వెంకటేష్‌లతో సమావేశమై పనులపై చర్చించారు. భవిష్యత్‌లో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా, అన్ని సౌకర్యాలు ఉండే విధంగా భవన నిర్మాణాన్ని డిజైన్‌ చేయాలని ఉదయ్‌ సూచించారు.



పరిశ్రమ సైట్‌ ఇంజనీర్‌ వంశీతో పాఠశాల భవన డిజైన్‌పై చర్చిస్తున్న సామాజిక వేత్త ఉదయ్‌ తదితరులు

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ఎమ్మెల్యే వివేకానంద్‌

కుత్బుల్లాపూర్‌: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగు పరిచి, నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే వివేకానంద్‌ అన్నారు. బుధవారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్‌ కార్యాలయంలో కుత్బుల్లాపూర్‌, దుండిగల్‌, బాచుపల్లి మండలాల ఎంఈవోలు, జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ప్రభుత్వ పాఠశాలల పనితీరు, ఆయా పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలను దేశానికే ఆదర్శవంతంగా తీర్చిదిద్దేలా విద్యాశాఖ అధికారులు పనిచేయాలని, అందుకు తన పూర్తి సహకారం ఉంటుందన్నారు. సమావేశంలో కుత్బుల్లాపూర్‌ ఎంఈవో జమిని కుమారి, బాచుపల్లి ఎంఈవో రామకృష్ణ, దుండిగల్‌ ఎంఈవో కృష్ణ, అసిస్టెంట్‌ ఎంఈవో రమేష్‌ తదితరులు పాల్గొన్నారు.



విద్యాశాఖ అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే వివేకానంద్‌

జాతర పోస్టర్‌ ఆవిష్కరణ

సూరారం కట్ట మైసమ్మ ఆలయ జాతర పోస్టర్‌ను బుధవారం ఎమ్మెల్యే వివేకానంద్‌ ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఫిబ్రవరి 8వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు జరిగే జాతర ఏర్పాట్లపై ఆయా శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమావేశమై సూచనలు చేశారు. భక్తులకు తాగునీరు, ఎలక్ట్రిసిటీ, తాత్కాలిక మరుగుదొడ్లు, విద్యుత్‌ దీపాల ఏర్పాట్లు, సీసీ కెమెరాలతో నిఘా వ్యవస్థ, ఆర్టీసీ సదుపాయం కల్పించాలన్నారు. జాతరలో పోకిరీల బెడద లేకుండా షీ టీమ్స్‌ను నియమించాలని సూచించారు. సమావేశంలో కార్పొరేటర్‌ సత్యనారాయణ, ఉప కమిషనర్‌ మల్లారెడ్డి, సీఐ భరత్‌ కుమార్‌, ట్రాఫిక్‌ సీఐ శ్రీనివాస్‌, వాటర్‌ వర్క్స్‌ జీఎం అశోక్‌, ఈఈ కిష్టప్ప, ఆలయ కమిటీ మాజీ చైర్మన్‌ మన్నె బాలేష్‌, సభ్యులు ఆలయ కమిటీ సభ్యులు వీరారెడ్డి, ప్రసాద్‌, మల్లేష్‌, దారం సాయి, కృష్ణారెడ్డి, సురేష్‌, ఇంద్రసేన, సాయిగౌడ్‌, మహేష్‌ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.



కట్టమైసమ్మ జాతర పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ఆలయ కమిటీ సభ్యులు